# ట్రూ న్యూస్

తెలుగు దిన పత్రిక

Telangana Hyderabad | Volume:01 Issue: 226 | Saturday OCT - 24 2026 | page's: 6 | Rs:4/-

తెలంగాణ హైదరాబాద్ | సంపుటి:01 సంచిక: 226 | శనివారం 24-10-2026 | పేజీలు : 6 | వెల.రూ. 4.00


# తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు!

**మహారాష్ట్రతో చర్చలకు సిద్ధం కావాలని సీఎం ఆదేశం.. డిండి, అచ్చంపేటకు అదనపు నీటి కేటాయింపులు**



రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ, డిండి, అచ్చంపేట ప్రాజెక్టుల పురోగతి, నీటి కేటాయింపులు, నిర్మాణ ప్రతిపాదనలపై కీలక చర్చలు జరిగాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డితో పాటు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2లో▸

## సరిహద్దులో చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నాయి:



**అరుణాచల్ సరిహద్దులో భారత్--చైనా ఘర్షణలు!**

**ఘర్షణలు కొనసాగుతున్నట్లు ఐటీబీపీ డీజీ వెల్లడి.**

**గల్వాన్ తరహా పోరుకు ప్రత్యేక శిక్షణ.**

**కేంద్రం సమాధానం చెప్పాలన్న కాంగ్రెస్ డిమాండ్.**

చైనా సరిహద్దు వెంబడి ఇప్పటికీ ప్రతిష్టంభన కొనసాగుతోందని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ డీజీ శత్రుజీత్ కపూర్ వెల్లడించారు. మరీ ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దు వద్ద భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ ఘర్షణలను ధ్రువీకరిస్తూ వెలువడిన తొలి ప్రకటన ఇదే కావడం గమనార్హం. "అరుణాచల్ సరిహద్దులోని పలు ప్రాంతాల్లో గత కొన్నిరోజులుగా ఘర్షణలు జరిగాయి. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

2లో▸

## నవంబర్ 3 నుంచి ఇండో--పసిఫిక్ ప్రాంతీయ సదస్సు

ఢిల్లీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న భారత నౌకాదళం

శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారంపై 18 దేశాల నిపుణుల చర్చలు

2లో▸




## దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి

**పోలీసు శాఖల్లో సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం, నిరంతర సంస్కరణలతో నేరాల నియంత్రణకు కృషి చేయాలి**

దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రాష్ట్రాల పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసింగ్ విధానాల్లో సంస్కరణలు తీసుకురావాలని, సాంకేతిక పరిజ్ఞానం, శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమన్వయ కమిటీ (ాా్రాజజ) సమావేశాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.



2లో▸

## బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఏపీకి వర్ష సూచన



2లో▸

## రపట్టభద్రుల ఓటరు నమోదుకు యువత భారీగా తరలిరావాలి:

## మంత్రి పొన్నం ప్రభాకర్



వివరాలు 2 లో..

**కంటోన్మెంట్‌లో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం.. సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నేతల ప్రచారం**

: అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలోని టీచర్స్ కాలనీ పార్క్ వద్ద హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేశ్, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ పాల్గొన్నారు. ఓటరు నమోదుకు యువతీ యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**నవంబర్ 6 వరకు ఓటరు నమోదుకు అవకాశం**

ఎమ్మెల్యే శగణేశ్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ప్రాంతంలో అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

## చంద్రబాబుతో మరోసారి పవన్ భేటీ.. సీట్ల సర్దుబాటుపై చర్చ

అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు తో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మరోసారి భేటీ అయ్యారు. పలుచోట్ల ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలపై ఏకాభిప్రాయం కుదరకపోవడంతో సీఎం నివాసానికి పవన్ చేరుకుని ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నామినేషన్ల గడువు నేటితో ముగుస్తున్న నేపథ్యంలో కూటమి సీట్ల సర్దుబాటుపై సుమారు అరగంట పాటు వీరిద్దరూ చర్చించారు. తెదేపా, జనసేన, భాజపాలోని ఆశావహులు తమకు అవకాశం ఉన్న చోట్ల పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. దీంతో ఆయా చోట్ల ఏకాభిప్రాయం సాధించే అంశంపై చంద్రబాబు, పవన్ చర్చించారు. గురువారం కూడా సీఎంతో పవన్ సమావేశమై సీట్ల సర్దుబాటుపై చర్చించిన విషయం తెలిసిందే.



## మీ ఇంటి వద్దకే మీ సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు కూడాలి



ప్రారంభించిన నెల రోజుల్లోనే మంచి స్పందన

మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా 3,885 కాల్స్

2లో▸

## ఎన్నికలు జరగకుండా చేయాలన్నదే వైకాపా కుట్ర



2లో▸

విజయవాడ: ఎలాగైనా ఎన్నికలు జరగకుండా చేయాలన్నదే వైకాపా కుట్ర అని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమ ఆరోపించారు. అందుకే అభ్యర్థుల చేతిలో నామినేషన్లు లాక్కొని చించేశారని మండిపడ్డారు. విధ్వంసం వాళ్లు సృష్టించి.. ఆ నెపం తెదేపాపై పెడుతున్నారని ఆక్షేపించారు. పుంగనూరుతోపాటు చాలా చోట్ల వైకాపా విధ్వంసానికి పాల్పడిందని మండిపడ్డారు.

# సంపాదకీయం

## ఓటు హక్కు తొలగింపు చిన్న విషయమా?

ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ కోట్లాది వయోజన భారతీయుల ఓటుహక్కు తొలగింపునకు దారితీసిందా? భారీ స్థాయిలో ఓటుహక్కు రద్దుపై వెల్లువెత్తిన విమర్శలను కొట్టివేస్తూ... చిన్న విషయంపై పెద్ద రభస చేస్తున్నారని అర్థశాస్త్ర విజ్ఞుడు సుర్జిత్ భల్లా విమర్శలు చేస్తున్న దృష్ట్యా పై ప్రశ్నను మరింత నిశితంగా తర్కించవలసిన అవసరమున్నది.

ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ప్రారంభం కాకముందు ఉన్న ఓటర్ జాబితాల నుంచి పేర్ల తొలగింపుల పైనే 'సర్' చర్చలన్నీ ప్రధానంగా జరుగుతున్నాయి. సర్ పూర్వపు ఓటర్ జాబితాల నుంచి 13.3 కోట్ల పేర్లను తొలగించడమే భారీ స్థాయి ఓటుహక్కు రద్దునకు రుజువు అని ఈ విమర్శకులు ప్రస్తావిస్తున్నారు. అయితే గత ఓటర్ జాబితాలలో పేర్లు అత్యధికంగా ఉన్నాయని తొలగించిన పేర్లు అన్నీ ఓటర్ నమోదులో లేనివారు, వేరే ప్రాంతాలకు వెళ్లినవారు, మరణించినవారు, ఒకే పేరు రెండుసార్లు ఉన్నవారివేనని సర్ మద్దతుదారులు ప్రతిస్పందిస్తున్నారు. నిజానిజాలు ఏమిటి? భారత ఎన్నికల సంఘం రూపొందించిన సర్ తుది జాబితాలు సరైనవేనని విశ్వసనీయ తనిఖీతో ధ్రువీకరించడం జరగకపోవడంతో వాటిపై గందరగోళం, వివాదాలు నెలకొన్నాయి. అయితే సర్ ఫలితాలను మూల్యాంకనం చేసేందుకు ఒక వివేకవంతమైన పద్ధతి ఉన్నది. సర్ తుది ఓటర్ జాబితాలను ఓటుహక్కుకు అర్హత ఉన్న వయోజన జనాభా అధికారిక అంచనాలతో పోల్చిచూడడం ద్వారా సర్ నిష్పాక్షికతను తెలుసుకోవచ్చు. నిజానికి ఈసీఐ సైతం ఓటర్ జాబితాలను మూల్యాంకనం చేసేందుకు అధికారిక వయోజన జనాభా అంచనాలను ఒక ప్రమాణంగా తీసుకుంటున్నది. కోట్లాది వయోజనుల ఓటుహక్కును రద్దు చేశారన్న ఆరోపణ సమర్థనీయమైనదేనని సర్ తుది ఓటర్ జాబితాలు, వయోజన జనాభా అంచనాల తులనాత్మక పరిశీలన స్పష్టం చేసింది. అంతేకాదు తుది జాబితాలలో పేర్లు లేనివారి సంఖ్యపై ఒక కచ్చితమైన అభిప్రాయానికి రావడానికి కూడా అది తోడ్పడింది.

సర్ ప్రక్రియ ప్రథమ, ద్వితీయ దశలు అమలయిన తొమ్మిది రాష్ట్రాలలో తుది జాబితాలలోని మొత్తం ఓటర్ల సంఖ్య ఆ రాష్ట్రాలలోని సమస్త వయోజన జనాభా అంచనాలకు 7 కోట్ల కంటే తక్కువగా ఉన్నది. దాదాపు 12శాతం వయోజనులను తుది జాబితాల నుంచి మినహాయించారు. ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే 2.8 కోట్ల మంది ఓటర్లను తొలగించారు. యూపీలో ఇలా ఓటు హక్కు కోల్పోయినవారు మొత్తం వయోజన జనాభాలో 17శాతానికంటే అధికం. ఈ తొమ్మిది రాష్ట్రాలలో సగటు తొలగింపుల రేటు 12శాతం దేశవ్యాప్తంగా మొత్తం తొలగింపులకు కూడా సూచకమయితే తుది ఓటర్ జాబితాలలో లేనివారు దాదాపు 12 కోట్ల మందిగా ఉంటారు. మూడో దశ సర్ ధోరణులను పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ సంఖ్య మరింత అధికంగా ఉండవచ్చు. హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ--కశ్మీర్ మినహా మిగతా రాష్ట్రాలు అన్నిటికీ ముసాయిదా సర్ జాబితాలను విడుదల చేశారు. ముసాయిదా జాబితాలలోనే తొలగింపులు సర్ మూడో దశలో మరింత అధికంగా ఉన్నాయి. మొదటి రెండు దశల ముసాయిదా జాబితాలను సరిదిద్దిన విధంగానే మూడో దశ జాబితాలలోనూ మార్పులు చేయడం జరగవచ్చని భావిద్దాం. అయినప్పటికీ అఖిల భారత స్థాయిలో సర్ అనంతర తుది ఓటర్ జాబితాలలో ఉండే పేర్లు ఇంచుమించు 87.8 కోట్లుగా ఉండగలవని రాహుల్ శాస్త్రి అంచనా వేశారు.

భారతదేశ ప్రస్తుత వయోజన జనాభా 101.6 కోట్లు. అంటే ఓటు హక్కుకు అర్హులైన దాదాపు 14 కోట్లమంది తుది జాబితాల నుంచి జారిపోయారు. వయోజన జనాభా పరిమాణం, ఓటర్ జాబితాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సుర్జిత్ భల్లా అంగీకరిస్తూనే, ఈ తేడా ఓటుహక్కు తొలగింపులను సూచించదని వాదిస్తున్నారు. ఓటర్ జాబితాలలోని మొత్తం ఓటర్ల సంఖ్య వయోజన జనాభా సంఖ్యతో సరిసమానంగా ఉండి తీరాలని ఏమీ లేదని ఆయన వాదన. 2024లో ఓటుహక్కుకు అర్హమైన వయసుకు వచ్చిన వారిలో ఎంతోమంది ఓటరుగా నమోదు చేయించుకునేందుకు శ్రద్ధ చూపలేదని, ఇటువంటి అలక్ష్యపరులు ఆ ఏడాది మొత్తం వయోజనులలో 7.5శాతంగా ఉన్నారని భల్లా చెబుతున్నారు. మిగిలిన జనాభాలోనూ ఇటువంటి తక్కువ నమోదును మరో 1శాతం మేరకు కలుపుకుంటే సాధారణంగా వాటిల్లే లోటు 8.5శాతంగా ఉండగలదని ఆయన నిర్ధారిస్తూ, ఈ 8.5శాతం పరిమితి కంటే ఎక్కువ ఉంటేనే, దానిని మితిమీరినదిగా, న్యాయ విరుద్ధమైనదిగా పరిగణించాలనేది సుర్జిత్ భల్లా వాదన.

## రపట్టభద్రుల ఓటరు నమోదుకు యువత

## భారీగా తరలిరావాలి:

మొదటి పేజీ తరువాయి

పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేయాలంటే ముందుగా ఓటరుగా నమోదు కావడం తప్పనిసరని పేర్కొన్నారు. నవంబర్ 6వ తేదీ వరకు పట్టభద్రుల ఓటరు నమోదుకు అవకాశం ఉన్నందున అర్హులైన వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పట్టభద్రులందరి ఓట్లను నమోదు చేయించేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పట్టభద్రుల సమస్యలపై గళమెత్తే సామర్థ్యం ఉన్న యువ నాయకుడు సామ రామ్మోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించిందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, న్యాయవాదులు, వైద్యులు సహా వివిధ రంగాలకు చెందిన పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని చెప్పారు.

పట్టభద్రుల సమస్యలను ప్రభుత్వాలు, సంబంధిత వేదికల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే నాయకత్వం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని కోరారు.

### ఓటు హక్కును కాపాడుకోవాలి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఓటు హక్కు పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ప్రతి గ్రాడ్యుయేట్ తన ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, పట్టభద్రులు తమ హక్కులను వినియోగించుకోవడంతోపా టు తమ సమస్యలను ప్రాతినిధ్యం వహించే నాయకులను ఎన్నుకోవడంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు.

## బంగాళాఖాతంలో అల్పపీడనం..

## ఏపీకి వర్ష సూచన

మొదటి పేజీ తరువాయి

అమరావతి: తూర్పు మధ్య- ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. శనివారం నాటికి అదే ప్రాంతంలో వాయుగుండంగా రూపాంతరం చెందనుంది. ఆదివారం తీవ్ర వాయుగుండంగా బలపడి.. ఈ నెల 26 ఉదయానికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉంది. తుపాను ఆ తర్వాత రెండు రోజుల్లో ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే సూచనలు ఉన్నాయి. అల్పపీడనం ప్రభావంతో ఏపీలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని కోరింది.

## దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాలి

మొదటి పేజీ తరువాయి

ఈ సమావేశానికి దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, వివిధ కేంద్ర దర్యాప్తు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రాల మధ్య నేరాల నియంత్రణ, సమాచార మార్పిడి, సరిహద్దులు దాటి పోలీసు సమన్వయం, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కీలక అంశాలపై సమగ్ర చర్చలకు ఈ సమావేశం వేదికగా నిలిచింది.

### పోలీసింగ్‌లో నిరంతర సంస్కరణలు అవసరం

సమాజానికి భద్రత, రక్షణ అత్యంత ముఖ్యమైన పునాదులని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమర్థవంతంగా, నైతిక విలువలతో, నిష్పక్షపాతంగా పనిచేసే పోలీసు వ్యవస్థను ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో నేరాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో పోలీసింగ్ విధానాలను కూడా ఎప్పటికప్పుడు ఆధునీకరించాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసు వ్యవస్థకు అందించే వనరులను కేవలం ఖర్చుగా కాకుండా, మెరుగైన సమాజ నిర్మాణానికి, పౌరుల భద్రతకు చేసే పెట్టుబడిగా పరిగణిస్తున్నామని వివరించారు. సంస్కరణలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలని, ప్రతి పోలీసు విభాగం తన పనితీరును మెరుగుపరుచుకుంటూ ముందుకు సాగాలని సూచించారు.

### హైదరాబాద్‌లో మూడు పోలీసు కమిషనరేట్లు

నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్లను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి కమిషనర్ తన పరిధిలోని సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

అలాగే వివిధ రకాల నేరాలు, ప్రజా భద్రతకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు హైడ్రా , ఈగల్ , టీ -సేఫ్ వంటి విభాగాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ట్రాఫిక్ సమస్యలను ప్రధాన సవాళ్లుగా పేర్కొంటూ, వీటి నియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక శిక్షణ, సమర్థవంతమైన కార్యాచరణ అవసరమని అన్నారు.

తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయిలో గుర్తింపు

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పోలీసు సంస్కరణలు సత్ఫలితాలను ఇస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, నక్సలిజం నిర్మూలన వంటి రంగాల్లో రాష్ట్ర పోలీసు శాఖ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతోందని చెప్పారు.

ప్రధాని నిర్వహించిన ప్రగతి సమీక్ష సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని వివరించారు. తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు కృషి చేసిన పోలీసు అధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభినందించారని గుర్తుచేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో ఈగల్ విభాగం కేంద్ర ప్రభుత్వం నుంచి 80 శాతానికి పైగా మార్కులు సాధించిందని తెలిపారు. సైబర్ నేరాల బాధితులకు పోగొట్టుకున్న డబ్బును తిరిగి ఇప్పించే విషయంలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందన్నారు.

### ఆహార కల్తీ నియంత్రణకు టీజీ -సేఫ్

ఆహార కల్తీని అరికట్టడం, ఔషధాల నియంత్రణను పటిష్టం చేయడం కోసం వివిధ విభాగాల ప్రయత్నాలను సమన్వయం చేసేందుకు అమెరికాలోని ఎఫ్డీఏ తరహాలో టీజీ -సేఫ్ అనే కొత్త విభాగాన్ని ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులను పరిరక్షించడం, పునరుద్ధరించడం, ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కాపాడటంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో ప్రత్యేక విభాగాల పనితీరు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ట్రాఫిక్ అసిస్టెంట్లుగా ట్రాన్స్‌జెండర్లను నియమించడం ద్వారా తెలంగాణ దేశంలోనే తొలి రాష్ట్రంగా నిలిచిందని పేర్కొన్నారు.

### పోలీసు కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం

విధి నిర్వహణలో నిరంతరం శ్రమిస్తూ, ప్రజల భద్రత కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే పోలీసు సిబ్బంది సంక్షేమం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పోలీసుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. హోంగార్డు నుంచి డీజీపీ వరకు పోలీసు సిబ్బంది పిల్లలు ఈ పాఠశాలలో చదువుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు.

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు సిబ్బంది కుటుంబాలకు అండగా నిలిచేందుకు, కానిస్టేబుల్ నుంచి ఐపీఎస్ అధికారి వరకు హోదా, సర్వీసు ఆధారంగా కనీసం రూ.కోటి నుంచి గరిష్ఠంగా రూ.2 కోట్ల వరకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించినట్లు వెల్లడించారు. బాధిత కుటుంబాలకు గృహ నిర్మాణ స్థలాలు కేటాయించడంతోపాటు, అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

## మీ ఇంటి వద్దకే మీ సేవలు, ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సేవలు కూడాలి

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దార్శనిక నాయకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, పారదర్శకమైన, అందుబాటులో ఉండే సేవలను అందించేందుకు మీ




సేవా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోంది.

ప్రజలు ఇకపై ఆదాయ, కుల, నివాస, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ నమోదు, ఆధార్ వివరాల అప్ డేట్ వంటి పలు సేవలను తమ ఇంటి వద్దనే పొందవచ్చు.లి

ఇందుకోసం మీ సేవా కేంద్రాలు లేదా ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, క్యూలలో వేచి ఉండకుండా మీ సేవా డోర్‌స్టెప్ డెలివరీ సేవ ద్వారా సేవలను పొందే అవకాశం కల్పించారు. ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ 1100 కు కాల్ చేయడం, మీసేవా పౌరుల పోర్టల్ ద్వారా అభ్యర్థన నమోదు చేయడం ద్వారా ఈ సేవలను పొందవచ్చు. ఆతర్వాత మీ సేవా ప్రతినిధి నిర్ణీత సమయంలో ఇంటికి వచ్చి అవసరమైన సేవను అందిస్తారు.ప్రారంభం నుంచే లభించిన మంచి స్పందనలి

ఈ సేవ ప్రారంభమైన మొదటి నెలలోనే 1100 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌కు ప్రజల నుంచి 3,885 కాల్స్ వచ్చాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం, పారదర్శకమైన పాలనను అందించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దార్శనికతలో ఈ కార్యక్రమం ఒక భాగం.

ప్రస్తుతం ఈ డోర్‌స్టెప్ సేవలు క్యూర్ (క్యూర్ ) పరిధిలోని ప్రాంతాల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. బుక్ చేసుకున్న సర్వీస్ ప్రకారం వర్తించే సేవా రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.

డోర్ స్టెప్ సేవలను ఎలా పొందాలి..?

1. టోల్‌ఫ్రీ నంబర్ ?1100కు కాల్ చేయండి లేదా మీ సేవా పౌరుల పోర్టల్ ద్వారా అభ్యర్థన నమోదు చేయండి.

2. అవసరమైన ధ్రువీకరణ పత్రం లేదా ఆధార్ సేవను ఎంచుకుని, కాల్ సెంటర్ ప్రతినిధికి అవసరమైన వివరాలను అందించండి. 3. నిర్ణయించిన సమయంలో మీ సేవా డోర్‌స్టెప్ ప్రతినిధి మీ ఇంటికి వచ్చి అవసరమైన సేవను అందిస్తారు.

## తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు!

మొదటి పేజీ తరువాయి

### మహారాష్ట్రతో త్వరలో చర్చలు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలోనే చర్చలు జరిపేందుకు సిద్ధం కావాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ తర్వాత చర్చలకు పిలుస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఇటీవల సూత్రప్రాయంగా అంగీకరించినట్లు ఆయన వెల్లడించారు. ఈ నేపథ్యంలో చర్చలకు అవసరమైన అన్ని నివేదికలు, సాంకేతిక వివరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే అవకాశం ఉంటుంది, మహారాష్ట్ర పరిధిలో ఎంత మేర భూమి ముంపునకు గురవుతుంది అనే అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అటవీ ప్రాంతాలు, గిరిజనులు అధికంగా నివసించే వెనుకబడిన ప్రాంతాలతో కూడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యానికి అనుగుణంగా బ్యారేజీ ఎత్తు ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో చర్చించిన అంశాలు, వాటికి సంబంధించిన వివరాలన్నింటినీ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అంతర్రాష్ట్ర సమన్వయం, సాంకేతిక సాధ్యాసాధ్యాలు, ముంపు ప్రభావంపై సమగ్ర సమాచారంతో చర్చలకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### డిండి, అచ్చంపేటకు అదనపు నీరు

డిండి ప్రాజెక్టు, అచ్చంపేట ఎత్తిపోతల పథకాలకు నీటి లభ్యత పెంచే దిశగా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ రెండు అవసరాల కోసం మొత్తం 0.6 టీఎంసీల నీటిని అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి అదనంగా 0.6 టీఎంసీల నీటిని ఏదుల రిజర్వాయర్ వరకు తీసుకువచ్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సీఎం ఆదేశించారు. ఈ విధానం ద్వారా డిండి, అచ్చంపేట ప్రాంతాల అవసరాలను తీర్చడంతోపాటు పాలమూరు ప్రాజెక్టు నీటి కేటాయింపులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడవచ్చని పేర్కొన్నారు. నీటిని తరలించేందుకు అవసరమైన పంప్‌హౌస్‌లు, పంపులు, ఇతర సాంకేతిక వ్యవస్థల ఏర్పాటును వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యం లేకుండా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నీటి కేటాయింపులు, అంతర్రాష్ట్ర చర్చలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో ఈ సమీక్ష సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీ విషయంలో మహారాష్ట్రతో జరగనున్న చర్చలు, డిండి--అచ్చంపేట పథకాలకు అదనపు నీటిని తరలించేందుకు చేపట్టే ఏర్పాట్లు తదుపరి కీలక పరిణామాలుగా నిలవనున్నాయి.

## సరిహద్దులో చైనాతో ఘర్షణలు కొనసాగుతున్నాయి:

మొదటి పేజీ తరువాయి

ఈ ఘర్షణల సమయంలో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అసాధారణంగా పనిచేస్తున్నారు" అని శత్రుజీత్ పేర్కొన్నారు. ఐటీబీపీ సిబ్బంది సేవలను గుర్తిస్తూ ప్రతి ఏటా జరిగే సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "పర్వత ప్రాంతంలో పోరాడే గెరిల్లా దళంగా తొలుత ఐటీబీపీని ఏర్పాటు చేశారు. 2004లో మనకు చైనా సరిహద్దు భద్రత బాధ్యతలను అప్పగించారు" అని అన్నారు.

### జమ్మూకశ్మీర్‌పై భారత్‌దే సార్వభౌమాధికారం

చైనా నే అత్యంత క్లిష్టమైన సరిహద్దు అని ఆయన అంగీకరించారు. గల్వాన్ తరహా ఘర్షణలను మెరుగ్గా ఎదుర్కోవడానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని సిద్ధం చేశామని, భూగర్భ మౌలిక సదుపాయాలను నిర్మిస్తున్నామని తెలియజేశారు. చైనాతో ఉన్న 3,488 కి.మీ. పొడవైన వాస్తవాధీన రేఖ వెంబడి ఈ ఐటీబీపీ పహారా కాస్తుంటుంది. ఎత్తైన ప్రదేశంలో జరిగే ఘర్షణలను ఎదుర్కోవడం శౌర్య కమాండోల ప్రత్యేకత.

### దేశానికి సమాధానం చెప్పాలి: కాంగ్రెస్

అరుణాచల్ వద్ద చైనా సైన్యంతో ఘర్షణలు జరిగినట్లు ఐటీబీపీ చీఫ్ వెల్లడించడంపై కాంగ్రెస్ స్పందించింది. ఈ అంశంపై దేశానికి సమాధానం చెప్పకుండా కేంద్ర ప్రభుత్వం మౌనాన్ని పాటిస్తోందని విమర్శించింది. ఇలా ఘర్షణలు జరుగుతున్నప్పటికీ చైనాకు మాత్రం రాయితీలను కొనసాగిస్తున్నారని దుయ్యబట్టింది. "లద్దాఖ్‌లో మాదిరిగానే పెట్రోలింగ్ పాయింట్లు చేజారిపోయాయని స్థానికులు చెప్పారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాల పేర్లను చైనా మారుస్తూనే ఉంది. మనకు ముప్పు కలిగించే ఆనకట్టను నిర్మిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ భద్రతకు సంబంధించి స్పష్టమైన సమాధానాలు దేశానికి కావాలి" అని డిమాండ్ చేసింది.

## నవంబర్ 3 నుంచి ఇండో-- పసిఫిక్ ప్రాంతీయ సదస్సు

మొదటి పేజీ తరువాయి

ఇండో--పసిఫిక్ ప్రాంతంలో శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో భారత నౌకాదళం నవంబర్ 3 నుంచి 5 వరకు న్యూఢిల్లీలో ఇండో--పసిఫిక్ రీజినల్ డైలాగ్--2026 (ఐపీఆర్డీ) నిర్వహించనుంది. నేషనల్ మారిటైమ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే ఈ అంతర్జాతీయ వ్యూహాత్మక సదస్సులో 18 దేశాలకు చెందిన నిపుణులు పాల్గొననున్నారు.

'ఇండో--పసిఫిక్‌లో శాస్త్ర, సాంకేతిక, విద్యా సహకారం' ప్రధాన ఇతివృత్తంగా సదస్సు జరగనుంది. సముద్ర పరిశోధనలు, విద్యాసంస్థల అనుసంధానం, మానవ వనరుల అభివృద్ధి, సముద్ర పాలన, వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించనున్నారు.

భారత్ ప్రతిపాదించిన ఇండో--పసిఫిక్ ఓషన్స్ ఇనిషియేటివ్‌లోని సహకార అంశాలను ఆచరణాత్మక ప్రతిపాదనలుగా మలచడంపై సదస్సు దృష్టి సారించనుంది. 'మహాసాగర్' సముద్ర దార్శనికతకు అనుగుణంగా ప్రాంతీయ భద్రత, అభివృద్ధికి భాగస్వామ్యాలను ప్రోత్సహించనుంది.

మూడు రోజుల కార్యక్రమంలో ఐదు ప్రధాన చర్చా సమావేశాలు నిర్వహించనున్నారు. విద్యా--పరిశోధన నెట్‌వర్క్‌లు, కీలక సముద్ర మౌలిక వసతుల రక్షణ, సముద్ర విజ్ఞానం, వాతావరణ సవాళ్లు, సముద్ర పాలనలో సహకారం, పౌర--రక్షణ రంగాల్లో ఉపయోగపడే సాంకేతికతల ప్రభావాలు తదితర అంశాలను పరిశీలించనున్నారు. సంయుక్త పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, శాస్త్రీయ సమాచార మార్పిడి, సంస్థాగత భాగస్వామ్యాలకు కార్యాచరణ మార్గాలను చర్చించనున్నారు.

ప్రారంభ రోజున 'పర్స్పెక్టివ్స్ ఫ్రమ్ ది ఫ్లాగ్ బ్రిడ్జ్' ప్రత్యేక సమావేశంలో భారత్, శ్రీలంక మాజీ నౌకాదళాధిపతులు పాల్గొననున్నారు. 'సహయోగ్ కా సంవాద్' పేరిట రాయబారులతో ప్రత్యేక ముఖాముఖి నిర్వహించనున్నారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తొలి రోజు స్మారకోపన్యాసం చేయనున్నారు.

వాతావరణ మార్పులు, సముద్ర వాణిజ్యం, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు, సముద్ర వనరులపై ఒత్తిడి వంటి సరిహద్దులు దాటిన సవాళ్లకు ఉమ్మడి పరిష్కారాలను అన్వేషించనున్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు సామాజిక, జీవ శాస్త్రాలు, మానవీయ శాస్త్రాల పాత్రనూ పరిశీలించనున్నారు. జాతీయ, ఉపప్రాంతీయ, ప్రాంతీయ స్థాయిల్లో అమలు చేయగల నిర్దిష్ట చర్యలను గుర్తించడమే సదస్సు ప్రధాన లక్ష్యం.

# ఎల్‌నినో పేరుతో మిల్లర్ల దోపిడీ..

-ఇష్టారాజ్యంగా బియ్యం ధరల పెంపు.
-నెల రోజుల్లో రెట్టింపైన బీపీటీ రేటు
-బీపీటీ క్వింటాల్ ధర రూ.4,500 నుంచి రూ.9,000కు పెంపు
-హెచ్ఎంటీ, జైశ్రీరాం బియ్యం ధరలకూ రెక్కలు
-పాత నిల్వలతో భారీ లాభాలు
-ఆందోళనలో సామాన్యులు



ఎల్‌నినో ప్రభావం ఉంటుందనే ప్రచారాన్ని ఆసరాగా చేసుకుని ఉమ్మడి జిల్లాలో బియ్యం ధరలు భారీగా పెంచుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బీపీటీ సన్న బియ్యం ధరను మిల్లర్లు నెల రోజుల్లోనే రెట్టింపు చేయడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో క్వింటాల్‌కు రూ.4,500గా ఉన్న బీపీటీ బియ్యం ధర ప్రస్తుతం రూ.9,000కు చేరినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. హెచ్ఎంటీ, జైశ్రీరాం రకాల బియ్యం ధరలు సైతం భారీగా పెరిగినట్లు తెలుస్తోంది.పాత నిల్వలతో భారీ లాభాలు? ఉమ్మడి జిల్లాలో సుమారు 456 రైస్ మిల్లులు ఉండగా, వాటిలో ఉన్న బియ్యం నిల్వలతో దాదాపు ఏడాదిన్నర పాటు వ్యాపారం చేయవచ్చని వ్యాపార వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఏడాది ఖరీఫ్ వరి కోతలు ప్రారంభమయ్యే వరకు, సెప్టెంబర్ మొదటి వారం నాటికి బీపీటీ బియ్యం క్వింటాల్ ధర రూ.4,500గా, హెచ్ఎంటీ రూ.6,500గా, జైశ్రీరాం రూ.7,500గా ఉన్నట్లు సమాచారం.అయితే, వరి కోతలు ప్రారంభం కావడంతో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన మిల్లర్లు వచ్చి వడ్లను క్వింటాల్‌కు రూ.3,800 చొప్పున కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో బియ్యం ధరలు పెరిగే అవకాశాలున్నాయనే ప్రచారం మొదలైంది. ఇదే అదనుగా భావించి ఉమ్మడి జిల్లా మిల్లర్లు ధరలను పెంచుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.రోజురోజుకూ పెరుగుతున్న ధరలు గతంలో తక్కువ ధరలకు కొనుగోలు చేసి నిల్వ ఉంచిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, ఇప్పుడు పెరిగిన ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొత్త ధాన్యం మార్కెట్‌లోకి వస్తున్న సమయంలో బియ్యం ధరలు తగ్గాల్సిందిపోయి పెరుగుతుండటంపై వినియోగదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బీపీటీ బియ్యం ధర నెల రోజుల్లోనే క్వింటాల్‌కు రూ.4,500 నుంచి రూ.9,000కు చేరడంతో ధరల పెంపు వెనుక అసలు కారణాలేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. హెచ్ఎంటీ, జైశ్రీరాం బియ్యం ధరలు కూడా పెరుగుతుండటంతో మధ్యతరగతి, పేద కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు బియ్యం ధరల పెరుగుదల మరింత భారంగా మారుతోంది.అధికారుల పర్యవేక్షణ ఏదీ? బియ్యం ధరలు ఏ రోజుకారోజు పెరుగుతున్నాయనే ప్రచారం నేపథ్యంలో మార్కెట్‌లో ధరల నియంత్రణ, నిల్వల వివరాలు, ధరల పెంపునకు గల కారణాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మిల్లుల్లో ఉన్న నిల్వలు, కొనుగోలు ధరలు, విక్రయ ధరలపై పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించాలని వినియోగదారులు కోరుతున్నారు.రానున్న రోజుల్లో బియ్యం ధరలు మరింత పెరుగుతాయనే ప్రచారం సామాన్యుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఎల్‌నినో ప్రభావం పేరుతో ధరలు పెరుగుతున్నాయా? లేక మార్కెట్ పరిస్థితులను ఆసరాగా చేసుకుని ధరలు పెంచుతున్నారా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## ఫారెస్ట్ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఆదివాసీల పంటలను ధ్వంసం చేయడం కరెక్ట్ కాదు...బీజేపీ నాయకులు తంబళ్ల రవి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం రామన్నగూడెంలో ఫారెస్ట్ అధికారుల దాడిలో పంట నష్టపోయిన ఆదివాసీ రైతు కుటుంబాలను పరామర్శించారు,ఈ సందర్భంగా బాధితులు తమ గోడును బీజేపీ నాయకుల ముందు వెళ్లబోసుకున్నారు,తాము నమ్ముకున్న భూముల్లో సాగు చేసుకుంటున్న పంటలను ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా,అకారణంగా ధ్వంసం చేయడం పట్ల ఆదివాసీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు,?బాధితుల పరిస్థితిని పరిశీలించిన తంబళ్ల రవి మాట్లాడుతూ..నిరుపేద ఆదివాసీల పొట్ట కొట్టేలా అటవీ శాఖ అధికారులు వ్యవహరించడం దుర్మార్గమన్నారు,పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు,అధికారుల ద్వారా వారిని వేధించడం తగదని మండిపడ్డారు,ఆదివాసీలకు నష్టపరిహారం చెల్లించాలని,వారి జోలికి ఫారెస్ట్ అధికారులు వెళ్లొద్దని డిమాండ్ చేశారు,ఆదివాసీలకు న్యాయం జరిగే వరకు బీజేపీ పార్టీ తరఫున పోరాటం చేస్తామని,వారికి తగిన అండదండలు అందిస్తామని ఈ సందర్భంగా తంబళ్ల రవి భరోసా ఇచ్చారు,ఇ కార్యక్రమంలో సర్పంచ్ మడకం నాగేశ్వరావు,బీజేపీ నాయకులు కొండా, శ్రీనివాసరావు,ఆదివాసీ రైతులు పాల్గొన్నారు.

# 87 వేల ఆర్థిక సాయంతో వెలుగులు నింపిన ఫ్రెండ్స్ గ్రూప్

- ఆపదలో అండగా నిలిచిన ఫ్రెండ్స్ గ్రూప్...!
- రూ.87 వేల ఆర్థిక సాయంతో వెలుగులు నింపిన 'ఫ్రెండ్స్ గ్రూప్'!
- ఇది 14వ సాయం...ఆగని వీరి సేవా ప్రస్థానం.



జగదేవపూర్ : అప్పుల ఊబిలో కూరుకుపోయి, కష్టాలు తట్టుకోలేక బలవన్మరణానికి పాల్పడిన ఓ యువ రైతు ఉదంతం పలుగు గడ్డ గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. కొన్ని రోజుల క్రితం పలుగు గడ్డ గ్రామానికి చెందిన లోకుల సాయిరాం అప్పులు తీరే మార్గం కనిపించకపోవడంతో ఆ యువ రైతు చెట్టుకు ఉరివేసుకుని తనువు చాలించాడు. ఆయన మరణంతో ఆ నిరుపేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబానికి ఇంటి పెద్ద దిక్కు కోల్పోవడంతో కోలుకోలేని దెబ్బ తగిలింది.ఆ కుటుంబం పడుతున్న ఆవేదనను చూసిన 'ఫ్రెండ్స్ గ్రూప్' సభ్యులందరూ చలించిపోయారు. కేవలం సానుభూతి చూపి ఊరుకోకుండా, ఆ నిస్సహాయ కుటుంబానికి చేతనైన సహాయం చేయాలని సంకల్పించారు.ఫ్రెండ్స్ గ్రూప్ అధ్యక్షులు నర్ర నర్సింలు లింగాల గణేష్ఆధ్వర్యంలో ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులందరూ కలిసి ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ, తమ వంతుగా పెద్ద మనసుతో ?87,000 (ఎనభై ఏడు వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని సేకరించారు. ఈ మొత్తాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేసి, మేమున్నామంటూ ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ గ్రూప్ అధ్యక్షులు నర్సింలు,గణేష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న స్నేహితుడి/రైతు కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో గ్రూప్ సభ్యులమంతా కలిసి ఈ మొత్తాన్ని సేకరించినట్లు తెలిపారు. అన్నం పెట్టే రైతు కుటుంబాలు ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రోడ్డున పడకూడదని, తమ వంతు చిన్న సహాయంగా దీనిని అందజేశామని పేర్కొన్నారు. ప్రభుత్వం కూడా స్పందించి ఈ బాధితుడి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి తమ గ్రూప్ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఇది 14వ సాయం.. ఆగని వీరి సేవా ప్రస్థానం ఈ స్నేహితుల బృందం కేవలం ఈ ఒక్క కుటుంబానికే కాదు, గ్రామంలో ఎవరికి ఏ కష్టం వచ్చినా స్పందిస్తు వస్తున్నారు. ఇప్పటివరకు వీరు సాయం అందించడం ఇది 14వ సారి కావడం విశేషం. తాము సంపాదించే సంపాదనలో కొంత భాగాన్ని సమాజ సేవ కోసం కేటాయిస్తూ, నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తు ఊరికే ఆదర్శంగా నిలుస్తున్నారు,ఈ కార్యక్రమంలో మాందాపూర్ గ్రామ సర్పంచ్ మౌనిక ముత్యం,పలుగు గడ్డ మాజీ సర్పంచ్ రాజేశ్వరి రవి,ఫ్రెండ్స్ గ్రూప్ సభ్యులు కృష్ణ, అంజయ్య,యువరాజు, లింగాల నరేష్,కనకయ్య, రమేష్,నరేష్,అజయ్,లింగాల రమేష్, శశిధర్,చెక్కల రమేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మారిస్తే అగ్నిగుండమే..

-బీసీ-ఏ కులాల నాయకుల హెచ్చరిక



ముదిరాజ్ కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ బీసీ-ఏ కులాల నాయకులు హెచ్చరించారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేరిస్తే తమ కులాల పిల్లలకు విద్య, ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.శుక్రవారం నిజాంపేట మండల కేంద్రంలో బీసీ-ఏ కులాల నాయకులతో కలిసి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు సంగు స్వామి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం బీసీ-ఏలో ఉన్న 57 కులాల జనాభాకు ముదిరాజ్ కుల జనాభా కూడా సమానంగా ఉంటుందని పేర్కొన్నారు.ఇప్పుడిప్పుడే బీసీ-ఏ కులాలు అభివృద్ధి ఫలాలను అందుకుంటున్న సమయంలో ముదిరాజ్‌లను అదే గ్రూపులో చేర్చడం తమకు నష్టం కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేరిస్తే తమ కులాల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వెలిబుచ్చారు.ఈ విషయంలో ప్రభుత్వం తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లను పట్టించుకోకపోతే రానున్న రోజుల్లో బీసీ-ఏలోని 57 కులాల ప్రతినిధులతో కలిసి మండల తహశీల్దార్ కార్యాలయాలు, కలెక్టరేట్లను ముట్టడిస్తామని సంగు స్వామి హెచ్చరించారు.ఈ సమావేశంలో గంగపుత్ర నాయకులు పంపరి నగేష్, పంపరి నర్సింలు, రజక సంఘం మండల అధ్యక్షుడు దుబ్బ రాజయ్య, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు రాజు, యాదగిరి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

-సంతాయిపేట్ గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం సంతాయిపేట్ గ్రామంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యెల్లారెడ్డి డీఎస్పీ ఎస్. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఎస్ నగర్ సర్కిల్ సీఐ వీరయ్య, తాడ్వాయి ఎస్ఐ వై. నరేష్, పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుమారు 100 మంది గ్రామస్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల మోసపూరిత ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని, ఆన్‌లైన్ లావాదేవీల సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, పిల్లలు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు, సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత సేవలను వినియోగించుకోవాలని వివరించారు.అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, బాలలను పనిలో పెట్టకుండా వారి విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చట్టవిరుద్ధ నేరమని, బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు పోలీసుల సూచనలను పాటిస్తూ సైబర్ నేరాల నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. 11

## కేజీబీవీలో వంట మనిషి సహాయకురాలి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం..



నిజామాబాద్ జిల్లా రూరల్ నియోజకవర్గ పరిధిలోని సిరికొండ మండలం పెద్దవాల్గోట్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వంట మనిషి సహాయకురాలి పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి షేక్ పర్వీన్ తెలిపారు.ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఏడో తరగతి లేదా పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 18 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలని తెలిపారు.అర్హత కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు తమ ఒరిజినల్ ఆధార్ కార్డుతో పాఠశాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి షేక్ పర్వీన్ సూచించారు.

# బిక్కనూర్ లో స్వీట్ షాపులపై స్పెషల్ డ్రైవ్ తనిఖీలు..

-గడువు తీరిన ఆహార పదార్థాల గుర్తింపు..

-అక్కడికక్కడే ధ్వంసం అపరిశుభ్రత ఉన్న దుకాణాలకు నోటీసులు జారీ



కమిషనర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా భిక్నూర్‌లోని పలు స్వీట్ షాపుల్లో అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొన్ని దుకాణాల్లో గడువు తీరిన ఆహార పదార్థాలను గుర్తించి, వాటిని అక్కడికక్కడే ధ్వంసం చేశారు.అలాగే అపరిశుభ్ర వాతావరణంలో నిర్వహిస్తున్న దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, విశ్లేషణ కోసం ప్రయోగశాలకు పంపించారు.ఆహార పదార్థాల తయారీదారులు, దుకాణ నిర్వాహకులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అధికారులు సూచించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించాలని స్పష్టం చేశారు.ప్రయోగశాల నివేదికలు అందిన అనంతరం వాటి ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

# ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి..

-రైతులకు సూచించిన జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి



ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, అందుబాటులో ఉన్న నీటి వనరులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జ్యోతి రైతులకు సూచించారు.భిక్కనూరు మండలం రాగట్లపల్లి గ్రామంలో శుక్రవారం ఆమె కూరగాయల సాగు పొలాలను సందర్శించి, పంటల స్థితిగతులను పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతపై రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కూరగాయల పంటలకు అవసరమైన నీరు అందుబాటులో ఉందా, పంటల పరిస్థితి ఎలా ఉందనే అంశాలపై ఆరా తీశారు.ప్రస్తుతం పంటలకు సరిపడా నీరు అందుబాటులో ఉందని, కూరగాయల పంటలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు ఆమెకు వివరించారు.ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ, వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను బట్టి రైతులు పంటల సాగు ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ, నీటి వృథాను అరికట్టాలని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పంటలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి సుమన్, ఉద్యాన విస్తరణ అధికారి బాపురెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ఎస్బీఐ అధికారుల నిర్లక్ష్యం.. నిలిచిపోయిన పంచాయతీ ఎకౌంట్లు!

- ములకలపల్లి ఎస్బీఐలో స్కానర్ నెపంతో సర్పంచులకు తిప్పలు -
- ప్రజాప్రతినిధులకే దిక్కులేని పరిస్థితి
- ములకలపల్లి ఎస్బీఐ తీరుపై సర్పంచులు,ప్రజల ఆగ్రహం
- వృద్ధులు,విద్యార్థులకు నరకం
- 16వ ఆర్థిక నిధుల ఎకౌంట్లకు బ్రేక్.. ఎస్బీఐ మేనేజర్ నిర్వాకంపై మండిపడుతున్న ప్రజాప్రతినిధులు
- ఎస్బీఐ బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంతో నిలిచిపోయిన పంచాయతీ ఎకౌంట్లు ప్రజాప్రతినిధులకే దిక్కులేదు






ములకలపల్లి:ములకలపల్లి మండల కేంద్రంలో ప్రజలకు ప్రధాన బ్యాంక్ అయిన ఎస్బీఐ బ్యాంక్ లో అధికారుల నిర్లక్ష్యం,నిర్వాకం తారాస్థాయికి చేరింది.పంచాయతీ ఎకౌంట్లు ఓపెన్ చేయడంలో తీవ్ర జాప్యం చేస్తూ,సర్పంచులను సైతం లెక్కచేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అసలు విషయం ఏంటంటే..**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 16వ ఆర్థిక సంఘం నిధుల కోసం ప్రతి గ్రామ పంచాయతీలో ఎస్బీఐలో ఖాతా ఓపెన్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో మండలంలోని ప్రతి పంచాయతీ నుండి సర్పంచ్,ఉప సర్పంచ్, కార్యదర్శులు బ్యాంకు బ్రాంచ్ కి వెళ్లి ఎకౌంట్ ఓపెనింగ్ కోసం తిరుగుతున్నారు.కానీ గత రెండు నెలలుగా,గత వారం రోజులుగా బ్యాంకులో స్కానర్ లేదు అనే సాకుతో ఎకౌంట్లు ఓపెన్ చేయకుండా దాటవేస్తున్నారని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.డెడ్ లైన్ దగ్గర పడుతున్నా,కాగితాలు తీసుకోకుండా,మేనేజర్, బ్యాంక్ సిబ్బంది సర్పంచులను మీరే ఎకౌంటు ఓపెనింగ్ ఫారాలను ఇంటికి తీసుకెళ్లమని చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.అడిగితే స్కానర్ లేదని దాటేస్తున్నారు ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులకే బ్యాంకులో ఇలాంటి పరిస్థితి ఉంటే,ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని మండిపడుతున్నారు.

**సామాన్యులకు నరకం..**

వృద్ధాప్య పింఛన్లు తీసుకోవడానికి వచ్చిన వృద్ధులను పట్టించుకోవడం లేదు.స్కాలర్ షిప్ ల కోసం ఎకౌంట్ ఓపెనింగ్ కు వచ్చిన విద్యార్థులను స్కానర్ లేదు,రేపు రండి అంటూ బయటకు పంపుతున్నారు.ఏదైనా ఆన్లైన్ లావాదేవీల గురించి అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని,రకరకాల కాగితాలు తెమ్మని వేధిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.బ్యాంక్ మేనేజర్ దారి,సిబ్బంది దారి వేరన్నట్టుగా వ్యవహరిస్తున్నారని,కస్టమర్లను లెక్కచేయడం లేదని మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.16వ ఆర్థిక నిధుల ఎకౌంట్ ఓపెనింగ్ గడువు ముగుస్తున్నా,ఎస్బీఐ అధికారులు స్పందించకపోవడంపై ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకొని చర్యలు తీసుకోవాలని సర్పంచులు, మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే రాజీనామా చేయాలని

- ఓటు పై వేటు నిరసనపై నిషేధం ఎత్తివేయాలని



బూర్గంపాడు మండలంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సారపాక సుందరయ్య నగర్ లో అక్టోబర్ శుక్రవారం 23న నిరసన ప్లే కార్డులు పట్టుకొని ప్రదర్శన ర్యాలీగా నినాదాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఉన్న ఓటు హక్కుని తొలగించాలని ఆలోచనతో జ్ఞానేశ్ కుమార్ ని పాములాగా ఉపయోగించు కున్నదని అందువల్ల ఈ దేశంలో 13 కోట్లు ఓట్లు రద్దయ్యే పరిస్థితి కనపడుతుందని అందుకోసం జ్ఞానేశ్ కుమార్ ని వెంటనే రాజీనామా చేయాలి అతనిపైన క్రిమినల్ కేసులు పెట్టాలని కేంద్రంలో మతోన్మాద బిజెపి ప్రభుత్వం అధికారుల్లో ఉన్నంతకాలం సామాన్య ప్రజలు బతికే పరిస్థితి లేదని ఓటు హక్కు కూడా రద్దు చేయాలని అనేక కుట్రలతో మళ్ళీ అధికారంలోకి రావాలని ప్రయత్నం చేస్తున్న బిజెపి ప్రభుత్వానికి సరైన గుణపాఠం ప్రజలు చెబుతున్నారని ఇవాళ ఢిల్లీ జంతర్ బందర్ నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా కాలరాస్తున్న మోడీ ప్రభుత్వానికి విద్యార్థి సంఘాలు గుణపాఠం చెప్తున్నారని ఇవాళ దేశవ్యాప్తంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ఆందోళన చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మహిళ సంఘం జిల్లా నాయకురాలు పాపినేని సరోజన, కెవిపిఎస్ మండల కార్యదర్శి రాయల వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు కనకం వెంకటేష్, బత్తుల గోపాలరావు, యార్లెంకి అప్పారావు, ఎస్ కె జాన్మియా, నిమ్మల పద్మ, బెల్లంకొండ పద్మ, నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు 18

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలి..

-రెండో విడత లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు.రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో భాగంగా కొత్తగా ఇళ్లు మంజూరైన అటికెల భూమయ్య, గణేష్‌లకు కలెక్టర్ మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్మించుకోవాలని సూచించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు తమ సొంతింటి కలను నెరవేర్చుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈ పీఆర్ సురేష్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ విష్ణువర్ధన్, ఏఈ ట్రాన్స్‌కో సుధాకర్, ఏపీఓ ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్, ఉపసర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీ చింపి వేసింద్రు అని ఎస్ఐకి ఫిర్యాదు

పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండలం కిలవనపర్తి గ్రామం లో దసరా పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీ ని చింపినారని స్థానిక ఎస్సై ఎంబడి. శ్రీకాంత్ కు ఫిర్యాదు చేసినట్లు ధర్మారం మండల ఎంఆర్పిఎస్ జనరల్ సెక్రెటరీ, కిలవనపర్తి గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కొత్తూరు. మహేందర్ తెలిపారు ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ నా ఎదుగుదలను చూసి ఓర్వలేక సొంత పార్టీ వారు అయినా కానీ, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలు ఐనా కానీ చింపివేసి ఉంటారని తెలిపారు వారిపై చట్ట ప్రకారంగా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు

# నందిగామ జైహింద్ హాస్పిటల్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారు మేజర్ డాక్టర్ యశ్వంత్

నందిగామ జైహింద్ హాస్పిటల్‌పై అసత్య ప్రచారం చేస్తున్నా వారి పై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం జైహింద్ హాస్పిటల్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ సి సి టీవీ వీడియో రికార్డులను బయటపెట్టిన యాజమాన్యం లీగల్ నోటీసులకు వివరణ ఇవ్వకుంటే చట్టపరంగా ముందుకు వెళతాం యాజమాన్యం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన ఆస్పత్రి నిర్వాహకులు సీసీటీవీ దృశ్యాలు విడుదల చట్టపరమైన చర్యలకు సిద్ధం డాక్టర్ యశ్వంత్ నందిగామ జైహింద్ హాస్పిటల్‌పై గత రెండు రోజులుగా అసత్య ప్రచారం జరుగుతోందని ఆస్పత్రి నిర్వాహకులు ఆరోపించారు ఈ మేరకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో మేజర్ డాక్టర్ యశ్వంత్ హాస్పిటల్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు తమపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సీసీటీవీ దృశ్యాలు ఇతర ఆధారాలను సంబంధిత అధికారులకు అందించినట్లు తెలిపారు ఈ వ్యవహారంపై చట్టపరంగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు అసలు ఏం జరిగింది ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5.30 గంటల సమయంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో చేతికి గాయంతో ఆస్పత్రికి వచ్చారని డాక్టర్ యశ్వంత్ తెలిపారు మొదట క్యాజువాలిటీలోకి తీసుకెళ్లి గాయానికి డ్రెస్సింగ్ చేశామని రక్త నమూనాలు సేకరించామని చెప్పారు. అనంతరం సర్జన్ పరీక్షించి నాలుగు కుట్లు వేయాల్సి ఉంటుందని సూచించినట్లు వివరించారు అప్పటివరకు రోగి నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోలేదని నాలుగు కుట్లు వేయడానికి రూ. 2,000 ఖర్చవుతుందని ముందుగానే వివరించామని తెలిపారు ఈ క్రమంలో సదరు వ్యక్తి తాను ప్రభ న్యూస్ రిపోర్టర్‌నని చెబుతూ తననే డబ్బులు అడుగుతారా అంటూ వాగ్వాదానికి దిగారని ఆరోపించారు బయట చికిత్సకు ఎక్కువ ఖర్చవుతుందని తమ ఆస్పత్రిలో సహేతుకమైన ధరలకే వైద్యం అందిస్తున్నామని వివరించినట్లు చెప్పారు ఈలోగా సదరు వ్యక్తి పక్కకు వెళ్లి అప్పటికే వేసిన డ్రెస్సింగ్‌ను తొలగించి వీడియో చిత్రీకరణ ప్రారంభించారని డాక్టర్ ఆరోపించారు ఆస్పత్రిలోని మహిళా సిబ్బందిని బెదిరిస్తూ దుర్భాషలాడారని పేర్కొన్నారు ఆస్పత్రికి వస్తే డబ్బులు తీసుకోకుండా వైద్యం చేయరా అంటూ వివాదానికి దిగారని తెలిపారు ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు ఆస్పత్రిలోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయని వాటిని విలేకరుల సమావేశంలో ప్రదర్శించినట్లు వెల్లడించారు రోగికి చికిత్స అందించాం డాక్టర్ యశ్వంత్ సంఘటన సమయంలో తాను అక్కడికి చేరుకున్న తర్వాత రోగిని ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి కుట్లు వేసినట్లు డాక్టర్ యశ్వంత్ తెలిపారు నాలుగు రోజుల తర్వాత పరిస్థితిని చూసి ఏడు రోజుల తర్వాత కుట్లు తొలగించేందుకు రావాలని రోగికి వివరంగా తెలిపామని అన్నారు రెండు రోజుల తర్వాత బెదిరింపులు సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత కొన్ని ఫొటోలు వీడియోలను ఆస్పత్రి వాట్సాప్ నంబర్‌కు పంపించి ఈ వ్యవహారంపై మాట్లాడాలని ప్రభ న్యూస్ రిపోర్టర్ ఖాసీం కోరినట్లు హాస్పిటల్ మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ తెలిపారు ఆస్పత్రిలో చికిత్సకు రూ. 2,000 బిల్లు అవుతుందని ప్రస్తావిస్తూ ఖాసీం తమను సంప్రదించినట్లు పేర్కొన్నారు దీనికి స్పందిస్తూ తమ ఆస్పత్రిలో చికిత్స ఖర్చులు సహేతుకంగానే ఉంటాయని వివరించినట్లు అనిల్ తెలిపారు అయితే తాను మీడియా వ్యక్తినని డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తానని ఆస్పత్రిలో నిబంధనలు పాటించడం లేదని ఖాసీం బెదిరించినట్లు అనిల్ ఆరోపించారు ఈ



వ్యవహారంపై చట్టపరంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు మహిళా సిబ్బందిని బెదిరించారని ఆరోపణ ఆస్పత్రి రిసెప్షన్‌లో పనిచేసే మహిళా సిబ్బందిని దుర్భాషలాడుతూ బెదిరించడంతో ఆమె భయాందోళనకు గురై గత మూడు రోజులుగా విధులకు హాజరు కావడం లేదని మార్కెటింగ్ డైరెక్టర్ అనిల్ తెలిపారు సదరు వ్యక్తిపై మహిళా సిబ్బంది కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు డాక్టర్ యశ్వంత్ పేర్కొన్నారు అధికారులకు ఆధారాలు అందించాం ప్రభ న్యూస్ రిపోర్టర్ ఖాసీం తమపై చేసిన ఆరోపణలకు సంబంధించి పూర్తి వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేశామని డాక్టర్ యశ్వంత్ తెలిపారు ఇందుకు సంబంధించిన పత్రాలు వీడియోలు ఇతర ఆధారాలను అధికారులకు సమర్పించినట్లు వెల్లడించారు చట్టపరమైన చర్యలకు సిద్ధం తమ ఆస్పత్రిపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా వ్యవహరించారని వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారని ఆరోపిస్తూ ప్రభ న్యూస్ రిపోర్టర్ ఖాసీంపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని డాక్టర్ యశ్వంత్ తెలిపారు ఈ మేరకు లీగల్ నోటీసులు పంపిస్తున్నామని ఈ విషయాన్ని వైద్యుల సంఘం దృష్టికి కూడా తీసుకెళ్తామని స్పష్టం చేశారు

# వన మహోత్సవంలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి..

**-మొక్కలకు నీరు పోసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**



వన మహోత్సవంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన మొక్కలకు నీరు పోసే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, వన మహోత్సవం సందర్భంగా నాటిన మొక్కలకు నీరు పోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, అది ఆరోగ్యంగా పెరిగేలా చూడటం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పచ్చదనం పెంపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాటిన మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందిస్తూ, అవి ఎండిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం, సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ దామోదర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీకాంత్, ఎంపీడీవో నాగేశ్వర్, తహశీల్దార్ ఉమలత, ఏఈ పీఆర్ సురేష్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ విష్ణువర్ధన్, ఏఈ ట్రాన్స్‌కో సుధాకర్, ఏపీఓ ధర్మారెడ్డి, సర్పంచ్ కిషన్ యాదవ్, ఉప సర్పంచ్ మధుకర్, పంచాయతీ కార్యదర్శి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నారాయణపురంలో ఘనంగా ఉచిత హెల్త్ క్యాంప్




రాయణపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత హెల్త్ క్యాంప్ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ మడకం కుమారి ఆంధ్రాయ్య , ఉప సర్పంచ్ ఆకుల శ్రీను , కార్యదర్శి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఈ క్యాంపును నిర్వహించారు. సర్పంచ్ , ఉప సర్పంచ్. సెక్రటరీ. స్వయంగా పరీక్షలు చేయించుకుని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో షుగర్, బిపి, గుండె సంబంధిత, టిబి, ఎక్స్-రే, స్కానింగ్ పరీక్షలు నిర్వహించి గ్రామస్తుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ వర్కర్లు, ఆశా వర్కర్లు, పాలకవర్గ సభ్యులు - 7వ వార్డు సభ్యులు ఎడ్లపల్లి రమేష్ - 4వ వార్డు సభ్యులు మడకం ఆంధ్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... ఈ యొక్క హెల్త్ క్యాంప్ గ్రామస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరూ వచ్చి ఈ పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని, నారాయణపురం గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు నెమలిపేట, పెంచికలపాడు, జగన్నాథపురం, సూర్యంపేట గ్రామస్తులందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలని కోరడం జరిగింది. ఈ హెల్త్ క్యాంప్ రేపు కూడా కొనసాగుతుందని తెలియజేశారు.

# టీడీపీ ప్రచారం జోరు 23వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా కాసర్ల నాగమణి ౘ మున్సిపల్

**- చైర్ పర్సన్ అభ్యర్థి వంశీధర్ ఆధ్వర్యంలో హోరెత్తిన ర్యాలీ**

నందిగామ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 23వ వార్డులో టీడీపీ ప్రచారం జోరుగా సాగుతోంది మూడో రోజుకు చేరుకున్న ప్రచారంలో టీడీపీ జనసేన బీజేపీ కూటమి నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొనడంతో వార్డులో పండగ వాతావరణం నెలకొంది 23వ వార్డు టీడీపీ కౌన్సిలర్ అభ్యర్థిగా కాసర్ల నాగమణి (వైఫ్ ఆఫ్ కాసర్ల లక్ష్మీనారాయణ) ను పార్టీ అధిష్టానం ఖరారు చేయడంతో మున్సిపల్ చైర్ పర్సన్ అభ్యర్థి శాఖమూరి వంశీధర్ ఆధ్వర్యంలో ప్రచారం హోరెత్తుతోంది ప్రతి గడప ప్రతి వీధి తిరుగుతూ ఓటర్లను కలుసుకుంటూ తమ యొక్క పార్టీ పాంప్లెట్ ను అందజేసి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్ పర్సన్ అభ్యర్థి శాఖమూరి వంశీధర్ మాట్లాడుతూ 23వ వార్డు టీడీపీ అభ్యర్థి కాసర్ల నాగమణి మంచి మనసున్న వ్యక్తి కలుపుగోలు వ్యక్తిత్వం కలిగిన మహిళ నిత్యం ప్రజా సమస్యల కోసం పోరాడే వ్యక్తి మన గుర్తు సైకిల్ గుర్తు చైర్ పర్సన్ గా నేను కౌన్సిలర్ గా కాసర్ల నాగమణి పోటీ చేస్తున్నాం మీ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించండి అని 23వ వార్డు ప్రజలను కోరారు మీ అమూల్యమైన ఓటు వేసి మమ్మల్ని గెలిపించండి మేమేంటో చూపిస్తాం అభివృద్ధి చేసి శాఖమూరి వంశీధర్ కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నందిగామలో జరిగిన అభివృద్ధి పనులను గుర్తు చేస్తు రాబోయే



రోజుల్లో వార్డులో ఉన్న సమస్యలన్నీ పరిష్కరించి నందిగామను మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు ఈ ప్రచార కార్యక్రమంలో టీడీపీ జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు మహిళలు స్థానిక ప్రజలు భారీ ఎత్తున పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు

# ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

**- ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి: ప్రజా సంఘాల నాయకులు**




ఎన్నికల సంఘాన్ని స్వతంత్రంగా నిర్వహించకుండా ఎన్నికల వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే బాధ్యతల నుంచి తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను రద్దు చేయాలని సీఐటీయూ, ఏఐకేఎస్, టీయూసీఐ నాయకులు పిట్టల అర్జున్, దొడ్డ లక్ష్మీనారాయణ, పండూరి వీరబాబు డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం దమ్మపేట సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియలో ఫారం-6లో అనేక మార్పులు చేసి కోట్లాది ఓట్లను తొలగించే విధంగా చర్యలు చేపడుతున్నారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేయడమేనని విమర్శించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓటర్ల హక్కులను హరించే చర్యలకు పాల్పడుతున్నారని, మతం ఆధారంగా ఓట్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించడంతో పాటు ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని, ఎన్నికల సంఘాన్ని సమూలంగా సంస్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి శ్రీనివాసరావు, సీఐటీయూ మండల కన్వీనర్ మురహరి రఘు, కొప్పుల శ్రీను, కౌలూరి రామకృష్ణ, బాబురావు, పద్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
24

# చందాపురం ఎంపీటీసీ అభ్యర్థిగా కొంగర నరేంద్ర నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ నెలకుదిటి నాగేశ్వరరావు



నందిగామ మండలం కేతవీరునిపాడు పంచాయతీ పరిధి చందాపురం సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యర్థిగా శ్రీ కొంగర నరేంద్ర నామినేషన్ దాఖలు చేశారు ఎంపీడీఓ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు ఈ కార్యక్రమశీలో కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ శ్రీ నెలకుదిటి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని అభ్యర్థికి సంఘీభావం తెలిపారు వారితో పాటు స్థానిక కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆశీస్సులతో చందాపురం కేతవీరునిపాడు ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు

# 43వ వార్డు గ్రాడ్యుయేట్ ఓటర్లు అర్హులైన వారందరూ ఓటు నమోదు చేసుకోండి

శ్రీమతి బత్తుల ఝాన్సీ లక్ష్మి రమేష్ 43వ వార్డ్ కౌన్సిలర్



ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరు నమోదు ప్రారంభం అయింది చివరి తేదీ నవంబర్ 6 వరకు ఉంది43 వార్డు పరిధిలోని అర్హులైన గ్రాడ్యుయేట్ సోదర సోదరీమణులందరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని 43వ వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి బత్తుల ఝాన్సీ లక్ష్మీ రమేష్ కోరారు. ఓటు నమోదు చేసుకోనట్లయితే, వెంటనే ఈరోజే నమోదు చేసుకోండి అని తెలిపారు.( గతం లో ఉన్న మీజ ఓట్లు చెల్లవ్, ప్రతి ఒకరు నూతన మీజ ఓట్లు అప్లై చేస్కోవాల్సిందే )ఓటరు నమోదు కోసం అవసరమైన పత్రాలు:

**1. పాస్‌పోర్ట్ సైజు ఫోటో 2. డిగ్రీ మెమో జిరాక్స్ 3. ఆధార్ కార్డు జిరాక్స్ 4. లోకల్ ఓటర్ ఐడీ జిరాక్స్ 5. మొబైల్ నంబర్ మీరు చేయాల్సిందల్లా పైన పేర్కొన్న పత్రాలను తీస్కొని రండి మేముఅందుబాటులో ఉన్న ఇంటర్ నెట్ షాప్ లో లేదా మా బిఆర్ఎస్ పార్టీ వారికి తగిన పత్రాలు ఇవండి. మీ గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియలో మా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మీకు సహకరిస్తారు లేదా ఈ లింక్ ఓపెన్ చేసి మీ మొబైల్ లో అప్లై చేయండి**

– ఆన్‌లైన్ దరఖాస్తు లింక్ : https://ceotserms2.telangana.gov.in/MLC/Form18.aspx

మీ ఓటు మీ హక్కు -- ప్రజాస్వామ్యంలో మీ భాగస్వామ్యం అర్హులైన ప్రతి డిగ్రీ, డిప్లొమా చదివి 2023 (పాస్ )ఇయర్ వరకు కంప్లీట్ అయినా వారు అందరూ గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకునేలా మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు ఈ సమాచారాన్ని తెలియచేయండి అని అన్నారు.

# గొల్ల గట్టు (పెద్దగట్టు) జాతరకు అధిక నిధులు కేటాయించాలి



– బీసీ విద్యార్థి సంఘం నేత లింగయ్య యాదవ్

తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద గొల్ల గట్టు (పెద్దగట్టు) అధిక నిధులు కేటాయించాలని బీసీ విద్యార్థి జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ వీరబోయిన లింగయ్య యాదవ్ తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు బారి అశోక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక లింగమంతుల స్వామి గుట్ట ను సందర్శించి వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలలో జరిగే జాతరకు అధిక నిధులు కేటాయించి గుట్టను అభివృద్ధి చేయాలి, అదేవిధంగా గుట్టకు సంబంధించిన భూములను ప్రభుత్వ అధికారులు సర్వే చేయించి హద్దులను గుర్తించాలి . శాశ్వత పాలకమండలని తక్షణమే ఏర్పాటు చేయాలి పర్మినెంట్ సౌకర్యాలను కల్పించాలి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం .గొల్ల గట్టు జాతర పట్ల అశ్రద్ధ వహిస్తే ముఖ్యమంత్రి ఇంటినీ లక్షలాది మందితో ముట్టడిస్తాం మని హెచ్చరించారు . కార్యక్రమంలో మాజీ గుట్ట డైరెక్టర్ మెంతబోయిన లింగస్వామి , బీసీ విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి పరాల సాయి, తెలంగాణ విద్యార్థి పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి నారబోయిన లోకేష్ యాదవ్, గురవయ్య, సందయ ,మున్న నాగయ్య తదితరులు పాల్గొన్నారు

# ఉన్నత విద్యతో సమాజంలో ఉన్నత స్థానం సాధించాలి

– జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం

ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా సమాజంలో ఉన్నత స్థానం సాధించడంతో పాటు తమ ప్రతిభతో సమాజానికి సేవలందించాలని పలువురు ప్రముఖులు విద్యార్థులకు సూచించారు. జమాతే ఇస్లామీ హింద్ ఆర్మూర్ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్మూర్, పర్కిట్ ప్రాంతాలకు చెందిన ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు పొందిన ముగ్గురు విద్యార్థులతో పాటు, ఎల్ఎల్బీ పూర్తి చేసిన విద్యార్థినిని ఆర్మూర్‌లోని జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ దేర్ అధ్యక్షుడు, వైద్యాధికారి డాక్టర్ అహ్సనుల్లా మాట్లాడుతూ, ముస్లిం విద్యార్థులు ఉన్నత విద్యా రంగాల్లో మరింత ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య, న్యాయ, విద్యా రంగాలు నేటి సమాజంలో ఎంతో ప్రాధాన్యత కలిగినవని పేర్కొన్నారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించడం విజయానికి తొలి మెట్టు మాత్రమేనని, తదుపరి దశల్లో కఠోర శ్రమతో పాటు పాఠ్యాంశాలను లోతుగా అధ్యయనం చేయడం, నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. తద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించే అవకాశం ఉంటుందన్నారు. జమాతే ఇస్లామీ హింద్ ఆర్మూర్ శాఖ స్థానిక అధ్యక్షుడు అస్లం బిన్ మొహసిన్ ప్రారంభోపన్యాసం చేస్తూ, ముస్లిం విద్యార్థులను ఉన్నత విద్యా రంగాల్లో ప్రోత్సహించేందుకు తమ సంస్థ నిరంతరం కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించడంతో పాటు, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించడం ద్వారా ఇతర విద్యార్థుల్లోనూ స్ఫూర్తి నింపడం, వారు సైతం ఉన్నత విద్యను అభ్యసించి వివిధ వృత్తిపరమైన రంగాల్లో రాణించేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఆషా ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, విద్యార్థులు నిరంతరం కష్టపడి చదవడంతో పాటు వైద్యరంగంలో ప్రత్యేక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఉన్నత స్థాయి వైద్య నిపుణులుగా ఎదగాలంటే నిరంతర అధ్యయనం, అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మౌలానా కబీరుద్దీన్ మజాహిరి మాట్లాడుతూ, విద్యార్థులు ధార్మిక విద్యతో




పాటు ఆధునిక విద్యలోనూ రాణించి, ఆధ్యాత్మికంగా, సామాజికంగా ఉన్నత స్థానాన్ని సాధించాలని సూచించారు. విద్యతో వ్యక్తిగత అభివృద్ధి సాధించడమే కాకుండా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్‌లో ప్రవేశాలు పొందిన ముష్తాహుద్దీన్ హమ్మాద్ తండ్రి వహీజుద్దీన్ మాజిద్, షేక్ రేహానుద్దీన్ తండ్రి షేక్ ఆరిఫుద్దీన్), షేక్ అబూజార్ తండ్రి షేక్ రఫీ ఎల్ఎల్బీ పూర్తి చేసిన జువేరియా నఖత్ తండ్రి మౌలానా కబీరుద్దీన్ మజాహిరి లను ముఖ్య అతిథులు డాక్టర్ అహ్సనుల్లా, డాక్టర్ అబ్దుల్ అజీజ్, మౌలానా కబీరుద్దీన్ మజాహిరి తదితరులు మెమెంటోలు అందజేసి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ఖాలిద్ అధ్యక్షత వహించగా, వాజిద్ అతిథులు, పాల్గొన్న వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# మల్లవరం బామ్మ దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కలను నెరవేర్చిన ఎంపీ రవిచంద్ర

ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరంకు చెందిన 96 సంవత్సరాల బామ్మ దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నెరవేర్చారు. మల్లవరం గ్రామ సర్పంచ్ గా 2సార్లు, ఎంపీటీసీగా 2 పర్యాయాలు, సింగిల్ విండో డైరెక్టర్ గా పని చేసిన సామ్రాజ్యం అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలకు పాత్రులయ్యారు. అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిపెట్టి అన్ని విధాలా గొప్పగా అభివృద్ధి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అంటే సామ్రాజ్యంకు ఎనలేని అభిమానం. మహానేత కేసీఆర్ ను కలిసి ఫోటో దిగాలనేది ఆమె చిరకాల కోరిక. ఈ విషయాన్ని ఆమె పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా



సామ్రాజ్యంను ఆమె కుమారులు వెంకటలాల్, అజయ్ కుమార్, మనవళ్ళు యుధిష్టర్, శ్రీరఘునందన్ లను వెంటబెట్టుకుని రవిచంద్ర శుక్రవారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు వద్దకు తీసుకెళ్లారు. సామ్రాజ్యంను కేటీఆర్ ఆప్యాయంగా పలకరించి శాలువాతో సత్కరించి గౌరవించారు, త్వరలో కేసీఆర్ వద్దకు తీసుకెళ్లి ఆమె చిరకాల కోరికను నెరవేర్చుతానని మాటిచ్చారు. రఘునందన్ ను అభినందించిన కేటీఆర్ సామ్రాజ్యం మనవడు, అజయ్ కుమార్ కుమారుడు శ్రీరఘునందన్ బెంగళూరులో బీబీఏ చదువుతున్నారు. ఆయనకు చిన్నతనం నుంచే సమాజ సేవ, పరిశుభ్రత, పచ్చదనం పట్ల మక్కువ ఎక్కువ. మహానేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా 2016 ఫిబ్రవరి 17వతేదీన తమ స్వగ్రామం మల్లవరంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన దత్తత తీసుకున్నారు. అప్పుడాయన 5వ తరగతి చదువుతున్నారు, వయస్సు 9 ఏళ్లు. తాను దత్తత తీసుకున్న ప్రాథమిక పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాక పరిసరాలలో పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంచారు. చిన్నతనంలోనే శ్రీరఘునందన్ చేస్తున్న సమాజసేవను అభినందిస్తూ 2017లో జాతీయ, 2017, 18లలో రాష్ట్ర స్థాయి స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా శ్రీరఘునందన్, ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్, రవిచంద్రలు అభినందించారు.

# ఆందోల్ లో ఘనంగా అలయ్-బలయ్ వేడుకలు

– ఆందోల్ నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లతో అభివృద్ధి పనులు –
పి పి టి ద్వారా వివరించిన మంత్రి దామోదర్

– తెలంగాణ సంస్కృతికి ప్రతీక అలయ్-బలయ్ – చౌటకూర్ మండలం తాటిదాన్పల్లి చౌరస్తా లో నీ ఎం ఎస్ ఫంక్షన్ హాల్ లో వేలాది మంది కార్యకర్తలతో ఘనంగా వేడుకలు

– 3 వేల కోట్ల అభివృద్ధితో ఆందోల్ రూపురేఖలు మార్చాం

రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహా గారి ఆధ్వర్యంలో ఆందోల్ నియోజకవర్గ స్థాయిలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు కొలమానంగా నిలిచే విజయదశమి పండుగ సందర్భంగా అలయ్-బలయ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. చౌటకూర్ మండలం తాడ్దాన్ పల్లి లోని ఎం.ఎస్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుండి నిర్వహించిన ఈ కార్యక్రమానికి వేలాదిగా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ..ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆందోల్ నియోజకవర్గంలో సుమారు 3 వేల కోట్ల పై చిలుకు రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యకర్తలకు వివరించారు. ముఖ్యంగా రోడ్లు, ఆసుపత్రుల నిర్మాణాలు, నర్సింగ్ కాలేజ్, హాస్టల్ భవనాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, కేజీబీవీ లు, సిఎస్ఆర్ నిధులతో విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు, కంప్యూటర్ ల్యాబ్ లు, బస్సులు, పాఠశాలల అభివృద్ధి, సంక్షేమ హాస్టళ్లలో వసతులు, ఆందోల్ లో స్టేడియం అభివృద్ధి, ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన లా కాలేజీ, పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం, జోగిపేట-ఆందోల్ పట్టణాలను అనుసంధానం చేస్తూ బ్రిడ్జిల నిర్మాణం, సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిసర ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, రవాణా, టూరిజం అభివృద్ధికి చేపట్టిన



పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, సభ్యులు కిషన్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ శ్రీ జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సురేందర్ గౌడ్, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్, దిగంబర రావు, శేషారెడ్డి, దుర్గారెడ్డి, గణేష్, కేదారనాథ్, ఆత్మ కమిటీ చైర్మన్లు, సర్పంచ్ లు, కౌన్సిలర్లు, సేవాదళ్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొని మంత్రి దామోదర్ రాజనర్సింహా కి అలయ్-బలయ్ శు భాకాంక్షలు తెలియజేశారు. 34